# దేవుని రాజ్యము

## The Kingdom of God

1987 లో నేను నా భార్య హిల్డా ప్రచురించిన "దేవుని రాజ్యము" అను పేరుగల పుస్తకము యొుక్క ఉపోద్ఘాతములోని మొదటి పేరా క్రిందివ్వబడినది. ఈ పుస్తకము www.kingdomofchrist.info అను మా వెబ్‌సైట్ నందు ఇంగ్లీషు మరియు తెలుగులో పోస్ట్ చేయబడినది.

**ఇల్లినాయిస్, రాక్‌పోర్డ్‌లోని కిల్‌బర్న్ అవెన్యూ క్రీస్తుసంఘమునందు అనేక సంవత్సరములు తరగతులు నిర్వహించుటకు నాకు కలిగిన అవకాశ ఫలితమునుబట్టి దేవుని రాజ్యము అను ఈ పుస్తకము వ్రాయబడినది. సంఘ బైబిలు స్కూలునందు బోధించుటకు కొద్దిమంది ఉపాధ్యాయులము కలసి ఆసక్తితో ప్రతివారము కూడుకొని తరగతుల కొరకు పాఠములు వ్రాసితిమి.**

ఏ పిల్లల కొరకైతే మేము ఈ పాఠములు వ్రాసినామో వారిలో మా పిల్లలు, విశ్వాసులు సమూహముగా రూపొందిన సహోదరి సహోదరులు మరియు వారి పిల్లలు చేరియున్నారు. ఉపాధ్యాయులమైన మేము దేవుని వాక్యము బోధించుటకు విశిష్టమైన బాధ్యత కలిగియుండి, మేము ఏమి బోధించుచున్నామో దానినే చేయాలని నిర్ణయించు కొనియున్నాము. అదేమిటంటే: "బైబిలు ఎచ్చట మాట్లాడునో అచ్చట మాట్లాడుట, బైబిలు ఎచ్చట మౌనముగా ఉండునో అచ్చట మౌనముగా ఉండుట." సంఘము కొరకైన బైబిలు స్కూలు బోధనాంశములలో చేర్చవలెనని మేమనుకొనిన పాఠము లేక వరుస పాఠములను ఎన్నుకొనుట మా పద్ధతియైయున్నది. ప్రణాళికాబద్ధమైన మా తరువాతి నిర్ణయము, "దేవుని రాజ్యము" అను పుస్తకములో ప్రచురించిన పాఠము లను అభివృద్ధి పరచుట.

మా గత కాలపు శిక్షణాభ్యాసములచేత, మా మత "జీవితపు పెట్టె" నుండి లేక మేము బందింపబడిన "ముందుగా ఏర్పరచుకొనిన ఊహల" నుండి మమ్మును మేము సాధ్యమైనంత స్వతంత్రులముగా చేసికొనవలెనను ముఖ్యమైన నిర్ణయము తీసికొంటిమి. లేఖనములు అసలు ఏ అర్ధమును ఇస్తున్నాయో ఆ సందర్భములో ప్రతి పాఠము యొుక్క అంశమునకు సంబంధించి లేఖనములను చదువుట మా తరువాతి సవాలైయున్నది. మా సొంత వ్యక్తిగత ఉద్దేశ ప్రకారమైన లేఖనముల అర్ధము - వాటి అసలైన ఏర్పాటు సందర్భము యొుక్క అర్ధము ద్వారా నియంత్రించబడవలె నననది మా గురియైయున్నది. ఈ పద్ధతిలో లేఖనములను ధ్యానించుట, ఆత్మీయ దేవుని రాజ్యము యొుక్క దృశ్యమును మాకు ఇచ్చినది. మేము నేర్చుకొని నమ్మిన వాటియందలి మా విశ్వాసము దేవుని ఆత్మీయ రాజ్యపు విశ్వాస ద్వారమును తెరచినది. ఒక దశాబ్దమునకుపైగా చదివి, వ్రాసి మరియు సిద్ధమనస్సుతో బైబిలు చదువు మా సమర్పణ ద్వారా మేము ముందుగా కలిగియున్న అభిప్రాయములను సరిజేసికొనిన తరువాత ఈ పుస్తకమును ప్రచురించితిమి.

దేవుని రాజ్యపు అధ్యయనమును గూర్చి మనము ముందుగా ఏర్పరచుకొనిన ఊహలను ప్రక్కన పెట్టుట ఎందుకు అతి ప్రాముఖ్యమైనది? రాజ్యము సంఘము ఒక్కటే అని మనకు బోధింపబడినది. ఎఫెసులో దేవుని కొరకు సంఘమును నిర్మించు టలో యేసుక్రీస్తుతో సహకరించుట కొరకు అపొస్తలుడైన పౌలు దేవుని రాజ్యమును ఎందుకు ప్రకటించినాడో మనమర్ధము చేసికొనలేదు (అపొ. కార్య. 19:8). యేసుక్రీస్తు తన సొంత రాజ్యమును కలిగియుండవలెననుకొనినట్లయితే, ఆయన దేవుని రాజ్యమును గూర్చి ఎందుకు బోధించినాడో మనమెరిగియుండలేదు (లూకా 4:43). మరోవిధముగా చెప్పవలెనంటే, "పరలోకమందును భూమిమీదను" యేసుకు "సర్వాధికారము ఇవ్వబడిన" మత్తయి 28:18 తరువాత దేవుని రాజ్యమును అర్ధము చేసికొని ప్రకటించుట కొరకు పరిశుద్ధాత్మ అపొస్తలులకు శక్తిని ఎందుకు ఇచ్చినాడు? యేసుక్రీస్తు తన రాజ్యముపై రాజుగా పట్టాభిషిక్తుడైన తరువాత దేవుని రాజ్యము బలముతో వచ్చుటను గూర్చి మనము చదివినాము. అయితే ఎందుకు? లూకా 22: 29, 30; యోహాను 18:36; అపొ. కార్య. 1:4-8; 2:36; 5:31; 2 పేతురు 1:11చూడండి. నజరేయుడైన యేసును దేవుడు ప్రభువుగాను క్రీస్తుగాను నియమించెనని పరిశుద్ధాత్మ ఆవేశమువలన పేతురు ప్రకటించిన తరువాత పౌలు, ఫిలిప్పు దేవుని రాజ్యమును గూర్చి ప్రకటించుట ఎందుకు కొనసాగించినారు? (అపొ. కార్య. 2:34; 8:12; 20:25).

తరువాత పౌలు, "క్రీస్తు యొుక్కయు దేవుని యొుక్కయు రాజ్యమునకు" క్రైస్తవులు హక్కుదారులు అని ఎఫెసీ 5:5లో చెప్పినాడు. ఇక్కడ ఆయన భావమేమి? రెండు రాజ్యములున్నవని ఆయన భావమా? "బైబిలు ఎక్కడ మాట్లాడుచున్నదో అక్కడ మాట్లాడుట" కొరకు క్రీస్తు రాజ్యమే క్రీస్తు సంఘము అని మనము ముందుగా ఏర్పరచుకొనిన ఊహను ప్రక్కన పెట్టవలసియున్నది. దేవుని మరియు క్రీస్తు యొుక్క రాజ్యము నిశ్శబ్ద అంశములు కావనునది బైబిలును సాధారణముగా చదువువారికి బాగా తెలుసు. దేవుని రాజ్యముగాని, క్రీస్తు రాజ్యముగాని స్థాపింపబడుటకు సంఘము ప్రకటింపబడలేదని మనకు తెలుసు. ఒక చిక్కు సమస్య: అపొస్తలులు దేవుని రాజ్యమును ప్రకటించినారు, అయితే ఏదో ఒక విధముగా మనము క్రీస్తు రాజ్యమును మరియు క్రీస్తునందు దేవుని సంఘమును కలిగియున్నాము, ఇది వాస్తవమెలా అవుతుంది?

దేవుని వాక్య భావమును సంపాదించుట కొరకు "ఇతరులపై ఆధారపడు వ్యాధి" నుండి పరిపక్వత చెందిన క్రైస్తవులు స్వతంత్రులగునట్లు వారికి సహాయపడుటకు ఈ వరుస పాఠములు

ప్రచురింపబడుచున్నవి. క్రీస్తు శరీరమైన సంఘమునందు సభ్యుడుగా క్రీస్తు రాజ్యపు ఆత్మీయ పాలనలో నివసించుట కొరకు, మనస్వంత విశ్వాస అభివృద్ధి కొరకు పరిపక్వత చెందిన క్రైస్తవులు తమ స్వంతగా బైబిలు చదువుట నేర్చుకొనవలసిన అవసరమున్నది. ఎవరైతే వారి బైబిలు అధ్యయనము ద్వారా ముందుగా ఏర్పరచుకొనిన తమ ఊహలను నియంత్రించ కోరుకొంటారో వారికి సహాయపడుటకు ఈ పాఠములు రూపొందించ బడినవి. క్రైస్తవులు బ్రాకెట్ పెట్టుట అభ్యసింపవలసి యున్నది; అనగా తన రాజ్యమును గూర్చి దేవుడు చెప్పునది వినునట్లు, మనము ముందుగా ఎరిగిన దానిని తాత్కాలికముగా ప్రక్కన పెట్టవలెను లేక బ్రాకెట్‌లో పెట్టవలెను.

ఈ ముందుమాట యొక్క మిగిలిన భాగము, ఈ ప్రశ్నలను గూర్చి నేను మరియు మా ఉపాధ్యాయ బృందము నేర్చుకొనిన సారాంశమైయున్నది. దేవుని రాజ్యమును గూర్చి "నేర్చుకొనదగిన విధానము"లో మేము నేర్చుకొనిన విషయము క్రిందివ్వబడినది. లేఖనము యొక్క అర్ధమును గూర్చి ముందుగా మనమేర్పరచుకొనిన ఊహలద్వారా ఏర్పరచబడిన "పెట్టినుండి బయటకు" ఆలోచించుటకు మమ్మును మేము క్రమపర చుకొంటిమి.

దయచేసి వ్రాయబడిన లేఖనములన్నింటిని చదవండి. దేవుని రాజ్యమును గూర్చిన మరియు మానవులను గూర్చిన దేవుని కథ సందర్భములో ఈ లేఖనములు ఆలోచించబడవలెను. ఈ కథలో ఒక పక్షపువారి ఆశలు, ఆశయాలు మరియు వ్యతిరేక పక్షపువారి ప్రతిక్రియలు ఉన్నవి. ఈ కథ చదువు వ్యక్తి కథలోని ఇతివృత్తమును అర్థము చేసికొని ఆ కథ ఎలా ముగింపునకు తేబడినదో అర్ధము చేసికొనవలెను. దేవుడు మానవులను ఎందుకు, ఎలా సృజించెననునది దేవుని కథయైయున్నది. ఆయన గురిని వ్యతిరేకించునట్లు దేవుడు సాతానును అనుమతించినాడు. ఇతివృత్తము మనలో ప్రతిఒక్కరిని గూర్చినది. మనలను మనము అడుగవలసిన ప్రశ్న: రెండు రాజ్యములలో, (దేవుని మరియు సాతాను యొక్క రాజ్యములలో) దేనియందు మన పౌరసత్వమున్న దని చెప్పుకొంటాము? యేసు పౌలుకు ఇచ్చిన ఆజ్ఞనందు మనము ఈ రెండు వ్యతిరేక బలగములను కనుగొంటాము: "... నేను ఈ ప్రజలవలనను అన్యజనులవలనను హాని కలుగకుండ నిన్ను కాపాడెదను; వారు **చీకటిలోనుండి వెలుగులోనికిని సాతాను అధికారమునుండి దేవుని వైపునకును** తిరిగి, నాయందలి విశ్వాసముచేత పాపక్షమాప ణను, పరిశుద్ధ పరచబడినవారిలో స్వాస్థ్యము పొందునట్లు వారి కన్నులు తెరచుటకై నేను నిన్ను వారి యొద్దకు పంపెదనని చెప్పెను" అపొ. కార్య. 26:16-18.

నలభై సంవత్సరములు దేవునితో ముఖాముఖిగా మాట్లాడిన మోషే, దేవుని నిత్యత్వమును గూర్చి మాట్లాడినాడు (ద్వితి. 33:27). దేవుని దయను అనుభవించిన దావీదు "నీ రాజ్యము శాశ్వత రాజ్యము, నీ రాజ్యపరిపాలన తరతరములు నిలుచును" కీర్తన 145:13అని వ్రాసినాడు. దేవుని రాజ్యమునకు వేరుగా మనము దేవుని గూర్చి మరియు మానవులపట్ల ఆయన చిత్తమును గూర్చి మాట్లాడలేము. దేవుడు ఒక్కడే కనుక ఆయన నిత్యరాజ్యము ఒక్కటే ఉంటుంది (1 తిమోతి 6:13-16). నిత్యము అనగా కాలమునకు ముందు పరలోకములో దేవుని రాజ్యము దేవునితో ఉనికి కలిగి ఉన్నది.

ఇశ్రాయేలు జాతిలో దేవుని రాజ్య పరిమాణము పనిజేస్తూ ఉన్నది (1 దిన. 28:5). ఇశ్రాయేలీయులకు దేవుని రాజ్యమును గూర్చి బోధించుటకు యేసు పంపబడి నాడు (లూకా 4:43). పరిశుద్ధాత్మ శక్తి ద్వారా యూదులకు అన్యులకు ఇద్దరికి దేవుని రాజ్యమును గూర్చి బోధించుటకు ఆయన అపొస్తలులకు తర్ఫీతు ఇచ్చినాడు (అపొ. కార్య. 1:1-8). ఇశ్రాయేలీయుల నాయకత్వము పట్టుపట్టుటనుబట్టి యేసు సిలువ వేయబడినాడు; దానికి కొంచెము ముందు యేసు ఇలా చెప్పినాడు, "కాబట్టి దేవుని రాజ్యము మీ యొద్దనుండి తొలగింపబడి, దాని ఫలమిచ్చు జనులకియ్యబడు నని మీతో చెప్పుచున్నాను" మత్తయి 21:43. ప్రభువు సంఘ సభ్యులముగా, మరియు దేవుని వాక్య బోధకులముగా, నలభై సంవత్సరముల క్రితము బోధకుల తరగతులలోని మా ఆసక్తి, రెండు ప్రశ్నలపై మా శ్రద్ధ నిలుపునట్లు చేసినది; "దేవునిరాజ్యము పొందిన ప్రజలెవరు మరియు ఆయన రాజ్యము కొరకు దేవుడు కోరుకొనిన ఫలమేమిటి?"

యూదులకు ప్రకటించుచున్నప్పుడు, బాప్తిస్మమిచ్చు యోహాను "ఫలము మరియు అబ్రాహాముసంతానము" అనువాటిపై దృష్టి కేంద్రీకరించినాడు; "మారు మనస్సునకు తగిన ఫలములు ఫలించుడి - అబ్రాహాము మాకు తండ్రి అని మీలో మీరు అనుకొన మొదలుపెట్టు కొనవద్దు; దేవుడు ఈ రాళ్ళవలన అబ్రాహామునకు పిల్లలను పుట్టింపగలడని మీతో చెప్పుచున్నాను. ఇప్పుడే గొడ్డలి చెట్ల వేరున ఉంచ బడియున్నది గనుక మంచిఫలము ఫలించని ప్రతి చెట్టును నరకబడి అగ్నిలో వేయబడు నని చెప్పెను" లూకా 3:8, 9. యేసుక్రీస్తు దేవుని రాజ్యమును గూర్చి బోధించుచున్న ప్పుడు, తరచుగా ఈ రెండు అంశములపై ఆయన పాఠములను కేంద్రీకరించి నాడు (మత్తయి 8:10-12; 12:33-37; 13:18-23). అబ్రాహాము సంతానము మరియు దేవుని సృష్టియైన మానవులలోనుండి ఆయన రాజ్యము కొరకు యేసు తీసికొనివచ్చు ఫలమునకు అది ఎలా సంబంధించి ఉన్నదో చదువుటకు ఈ పుస్తకములోని వ్యక్తిగత పాఠములు అంకితము చేయబడినవి. ఆయన కోరుకొనిన ఫలము పొందుట కొరకు, దేవుడు మానవులను సృజించినాడు. బైబిలులోని ఆయన కుమారుని రాజ్యము యొక్క కథనుండి తండ్రియైన దేవుడు, ఆయన ఫలమైన ఆయన పిల్లలు విడదీయబడనేరరు (ఎఫెసీ. 5:5; ఫిలిప్పీ. 2:14-16; కొలొస్స. 1:10-14). వారంలో మొదటి రోజున ఆరా ధించు ఆరాధన మరియు నూతన జన్మ ప్రక్రియలు ప్రాముఖ్యమైన బోధలే; అయినప్పటికి, బైబిలు అధ్యయమునకు సంబంధించి, సృష్టియొక్క ఫలముగా

ఉండునట్లు మానవులను సృజించుట కొరకైన ఆయన ఉద్దేశము మొదటి ప్రాముఖ్యతయైయున్నది (రోమా 8:18-24). వాస్తవానికి, "దేవుని కొరకు ఫలము ఫలించుట" ఒక్కటే ఇతివృత్తము:

> *ఎవని నిమిత్తము సమస్తము ఉన్నవో, యెవనివలన సమస్తమును కలుగుచున్నవో, ఆయన అనేకులైన కుమారులను మహిమకు తెచ్చుచుండగా వారి రక్షణకర్తను శ్రమలద్వారా సంపూర్ణునిగా చేయుట ఆయనకు తగును. పరిశుద్ధపరచువారికిని పరిశుద్ధపరచబడువారికిని అందరికి ఒక్కటే మూలము. ఈ హేతువుచేతను వారిని సహోదరులని పిలుచుటకు ఆయన సిగ్గుపడక - నీ నామము నా సహోదరులకు ప్రచురపరతును, సమాజముమధ్య నీ కీర్తి గానముచేతును అనెను. మరియు - నేనాయనను నమ్ముకొనియుందును అనియు - ఇదిగో నేనును దేవుడు నా కిచ్చిన పిల్లలును అనియు చెప్పుచున్నాడు. కాబట్టి ఆ పిల్లలు రక్తమాంసములు గలవారైనందున ఆ ప్రకారమే మరణము యొక్క బలముగలవానిని, అనగా అపవాదిని మరణముద్వారా నశింపజేయుటకును, జీవితకాలమంతయు మరణభయముచేత దాస్యమునకు లోబడినవారిని విడిపించుటకును, ఆయన కూడ రక్తమాంసములలో పాలివాడాయెను. ఏలయనగా ఆయన ఎంతమాత్రమును దేవదూతల స్వభావమును ధరించుకొనక, అబ్రాహాము సంతాన స్వభావమును ధరించుకొనియున్నాడు.*
>
> *హెబ్రీ 2:10-16*

ఇది క్లిష్టమైన కథకాదు; అయినప్పటికి, యుగములన్నిటిలో "మతవ్యాపారము"లో ఉన్న ప్రజలు ఇతివృత్తమును గందరగోళము చేసియున్నారు. కథ దేవునితో ప్రారంభ మయి, ఆయన ప్రపంచములను సృష్టింపకముందు మానవాళి కొరకైన ఆయన గురిని ప్రకటిస్తుంది (1 కొరింథీ. 2:6-10; రోమా 8:28-30). ప్రతి జీవాత్మ కొరకు ఆయన ఒకే ఒక గురి కలిగియున్నాడు. ఈ గొప్ప ఇతి వృత్తములో క్రైస్తవుల ప్రస్తుత **పోరాటము** కొరకైన దేవుని కృప జగత్తు పునాదికి ముందే దేవుని మనస్సులో ఉన్నది (ఎఫెసీ. 1:3-14; తీతు. 1:1-3; 1 పేతురు 1:18-21). ముగింపు, దేవుని రాజ్యముయొక్క మన స్వాస్థ్యము; క్రైస్తవ విశ్వాసములోని నిరీక్షణయైయున్నది. "జయించువాడు వీటిని స్వతంత్రించుకొనును; నేనతనికి దేవుడనైయుందును అతడు నాకు కుమారుడై యుండును" ప్రకటన 21:7. యెషయా 43:5-7తో కలిపి అనేక లేఖనములలో అపొస్తలు డైన పౌలు ద్వారా మనకొరకు ఇతివృత్తము సంక్షేపింపబడినది.

> *కావునా మీరు వారి మధ్యనుండి బయలువెడలి ప్రత్యేకముగా ఉండుడి; అపవిత్రమైన దానిని ముట్టకుడని ప్రభువు చెప్పుచున్నాడు -మరియు నేను మిమ్మును చేర్చుకొందును, మీకు తండ్రినైయుందును, మీరు నాకు కుమారులును కుమార్తెలునై యుందురని సర్వశక్తిగల ప్రభువు చెప్పుచున్నాడు. 2 కొరింథీ. 6:16-18*

దేవుని రాజ్యము ఇప్పుడు పనిజేస్తుంది మరియు ఈ లోకము గతించిన తరువాత కూడ ఇది ఎల్లప్పుడు ఉనికి కలిగి ఉంటుంది (1 కొరింథీ. 15:24-28). పరలోకములో మరియు భూమిమీద దేవుని చిత్తము ఎక్కడ జరుగుచున్నదో అక్కడ ఆయన నిత్య రాజ్యమున్నది (మత్తయి 6:10). ఆయన అభివృద్ధిపరచిన ఇశ్రాయేలు దేశమును పరిపాలించు శక్తి/అధికారము దేవునికున్నది. అయినప్పటికి, వారి ప్రవర్తనలో ఆయన చిత్తము ఎప్పుడూ తెలియపరచబడలేదు. వారి ప్రవర్తన దేవుని మనస్సులో ఉన్నదానితో ఐక్యముకాలేదు. యాకోబు ద్వారా అబ్రాహాము సంతానము కొరకు ఆయన తన మనస్సులో ఏమి కలిగియున్నాడో దయచేసి, ఆది. 12:1-3; నిర్గమ. 19:5; రోమా 9:3-5 చూడండి. యూదుల జీవన విధానములో ఆయన చిత్తము తెలియపరచబడ లేదు. రోమా 2:17-24 చూడండి. జీవాత్మలన్నీ బానిసలుగానో లేక మర మనుషులుగానో ఉండక తన పిల్లలుగా ఉండాలని దేవుడు మానవులను సృజించుట వలన, ఆయన తన చిత్తమును మనుష్యులపై ఎందుకు రుద్దుటలేదో మనమర్థము చేసికొనవచ్చును.

దేవుని రాజ్యమెప్పుడూ దేవునితో ఉన్నది. దేవుని ప్రేమించుట నేర్చుకొనువారి "వ్యక్తిగత ఆత్మలలోనికి" దేవుని రాజ్య సంస్కృతి యొక్క అసలైన జీవము రావాలనునది, మత్తయి 6:10లోని యేసు ప్రార్థన. భూమిమీద దేవుని రాజ్యము, ఆయన ప్రజల జీవితములలో ఈ గంటలో ఎక్కడ ఆయన చిత్తము జరుగుచున్నదో అక్కడున్నది. దేవుని చిత్తము నెరవేర్చుటకు యేసు పరలోకమునుండి భూమిమీదకు వచ్చినాడు (యోహాను 4:34; 5:19, 30; 6:38; ఫిలిప్పీ. 2:5-11). కాబట్టి, దేవుని రాజ్యము సమీపించియున్నదని యేసు ప్రకటించినాడు, అయితే ప్రజలు వారి విశ్వాసము నందలి విధేయతతో ఆయన చిత్తమును అంగీకరించవలెను (మత్తయి 4:17; రోమా 1:5). ఈ సందర్భములో, మాకు దేవుని రాజ్యము చూపించుమని పరిసయ్యులు ఆయనను అడిగిన తరువాత యేసు ఇచ్చిన జవాబును కూడ మనము అర్థము చేసి కొనవలసిన అవసరమున్నది; ఆయన జవాబు ఆయన శిష్యులు కూడ ఉలికిపడేలా ఉందనుటలో సందేహం లేదు.

> *దేవుని రాజ్యమెప్పుడు వచ్చునని పరిసయ్యులు ఆయననడిగినప్పుడు ఆయన -దేవుని రాజ్యము ప్రత్యక్షముగా రాదు. ఎందుకనగా ఇదిగో దేవుని రాజ్యము మీ మధ్యనేయున్నది గనుక, ఇదిగో ఇక్కడనని, అదిగో అక్కడనని చెప్ప వీలుపడదని వారికి ఉత్తరమిచ్చెను. లూకా 17:20, 21*

"యేసు -నా రాజ్యము ఈ లోకసంబంధమైనది కాదు; నా రాజ్యము ఈ లోక సంబంధమైనదైతే నేను యూదులకు అప్పగింప బడకుండునట్లు నా సేవకులు పోరాడుదురు గాని నా రాజ్యము ఇహసంబంధమైనది కాదనెను" యోహాను 18:36. ఇది యేసు పిలాతుతో చెప్పిన మాట. యేసు బోధించిన దేవుని రాజ్యము పరలోకములో ఉన్న దేవుని నిత్యరాజ్యము. యేసు రాజ్యములోని పౌరులు లోకపరిపాలనలోని సాతాను రాజ్యము నుండి బయటకు పిలువబడినవారు. పిలువబడిన గుంపు- సంఘము, మన స్వంత పాపమరణముల నుండి రక్షింపబడిన ప్రజలము (1 కొరింథీ. 1:30; 6:11). ఇది మన నూతన జన్మలో సంభవించినది; కాబట్టి దేవుడు "క్రీస్తుయేసు నందు మనలను ఆయనతోకూడ లేపి, పరలోకమందు ఆయనతోకూడ కూర్చుండ బెట్టెను" ఎఫెసీ. 2:7. యోహాను 3:3; 5:24; రోమా 6:2-4 చూడండి.

మనము సృష్టింపబడుట కొరకైన దేవుని ఉద్దేశమును అంగీకరించిన పరిపక్వత చెందిన ప్రజల జీవితములలో పరిపాలించుటకు యేసుక్రీస్తుకు సర్వాధికారము ఇవ్వబడియున్నది (1 కొరింథీ. 2:7; 2 తిమోతి 1:8-10; ప్రకటన 1:4-7). దేవుని నిత్య రాజ్యములో మనలను పిల్లలుగా కలిగియుండు తన తండ్రి లక్ష్యమును తృప్తిపరచుట కొరకైన తన గురిని సాధించుటలో అడ్డుపడు శక్తులన్నిటి మీద పరిపాలించు అధికారము కూడ ఆయన కలిగియున్నాడు (ఎఫెసీ. 1:18-23; 3:10, 11; 6:10-18). ఈ విధముగా యేసు రాజ్యమును మనము అర్థము చేసికొనవలెను. తన తండ్రిచేత ఆయనకివ్వబడిన అధికారము మహిమకు కుమారులను తెచ్చు తన తండ్రి చిత్తమును తృప్తిపరచుటకు పనిచేయుచున్నది. ఈ ప్రత్యేకమైన ఉద్దేశము కొరకు దేవుని రాజ్యములో క్రీస్తు రాజ్యము పనిచేయుచున్నది. "... సమస్తమును లోపరచబడియున్నదని చెప్పినప్పుడు ఆయనకు సమస్తమును లోపరచినవాడు తప్ప సమస్తమును లోపరచబడియున్నదను సంగతి విశదమే" 1 కొరింథీ. 15:27. యేసుక్రీస్తును మన రాజుగా, ప్రభువుగా అంగీకరించిన క్రైస్తవుల కొరకు దేవుడు గొప్ప పాత్రను నిర్వహించుచున్నాడు (2 కొరింథీ. 1:3, 4; యాకోబు 1:16-18). దేవుడు క్రైస్తవులను "ఆదరించు" ప్రియమైన తండ్రి (2 కొరింథీ. 1:3, 4; గలతీ. 4:6, 7). "శ్రేష్ఠమైన ప్రతి యీవియు సంపూర్ణమైన ప్రతి వరమును, పరసంబంధమైనదై, జ్యోతిర్మయుడగు తండ్రియొద్దనుండి వచ్చును; ఆయనయందు ఏ చంచలత్వమైనను గమనాగమనమువలన కలుగు ఏ ఛాయయైనను లేదు" యాకోబు 1:17.

తిరిగి జన్మించిన విశ్వాసులైన క్రైస్తవులు దేవుని ప్రియ కుమారుని రాజ్యములోనికి మార్చబడి యున్నారు. "ఏలయనగా మీరు మృతిపొందితిరి, మీ జీవము క్రీస్తుతోకూడ దేవునియందు దాచబడియున్నది" కొలొస్స. 3:3. "క్రీస్తునందు" మనము దేవునిలో లేపబడియున్నాము. దేవుని మరియు క్రీస్తు రాజ్యమునుండి ఈ భాషను మనం విడదీయలేము. మన నిరంతర ఎదుగుదల క్రమములో, యేసు బోధలను అర్థము చేసికొని, నమ్మి వాటియందు మన విశ్వాసమును ఉంచుచుండగా, దేవుని నిత్యరాజ్య సంస్కృతి మన మనస్సులు, హృదయములలోనికి చొచ్చుకొనిపోతుంది (యోహాను 1:3, 4; మత్తయి 13:31, 32). దేవుని రాజ్య సంస్కృతిలోనికి సాంఘీకరణ చెందుట, క్రైస్తవులు పరిశుద్ధపరచబడు కార్యక్రమము ఒకటే (2 థెస్స. 2:13-14). క్రైస్తవుల మనస్సులు, హృదయములపై దేవుడు వ్రాయ కోరుకొనిన క్రొత్తనిబంధన చట్టములు, ప్రతి క్రైస్తవుని "ఆత్మ"పై దేవుని రాజ్య సంస్కృతి "ముద్రింపబడుటయే" (హెబ్రీ. 10:16, 17). "కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి; పాతవి గతించెను, ఇదిగో క్రొత్తవాయెను" 2 కొరింథీ. 5:17. పరిశుద్ధాత్మ పరిశుద్ధపరచు ప్రణాళికకు మన మనస్సులను, హృదయములను అప్పగించుకొనుట ద్వారా క్రైస్తవులు నిరంతరము తమ ఆత్మలను నూతనపరచుకొంటారు (ఎఫెసీ. 4:22-24).

దేవుని రాజ్యములోని జీవిత వివరణను మన రాజైన యేసుక్రీస్తు బోధించి లోకమునకు తెలియబరచినాడు. రాజ్యపు జీవిత వైఖరులను ఆయన ఉపమానముల యందు దృష్టాంతపరచి నాడు. రాజ్యసంస్కృతి యొక్క శక్తి, మనకు అర్థమయ్యే "ప్రకృతి భాష"లో అనేక ఉపమానముల ద్వారా తెలుపబడినది. ఆయన తన శిష్యులతో, "పరలోకరాజ్య మర్మములు ఎరుగుట మీకు అనుగ్రహింపబడియున్నది గాని వారికి అనుగ్రహింపబడలేదు" మత్తయి 13:11 అని చెప్పినాడు. క్రైస్తవులమైన మనము రాజ్యములోనికి మారనట్లయితే, రాజ్యమును గూర్చి సరిగా ఆలోచించలేము. మనము దానిని ఇంకా స్వతంత్రించుకొనలేదు, అయితే "జయించువాడు వీటిని స్వతంత్రించు కొనును; నేనతనికి దేవుడనైయుందును అతడు నాకు కుమారుడైయుండును" ప్రకటన 21:7.

దేవుని రాజ్యసంస్కృతి మన "ఆత్మల"లో చొచ్చుకొని పోతుంది. మనము లోకము లోని సాతాను రాజ్య సంస్కృతిని జయిస్తున్నాము (ఎఫెసీ. 2:1-3; 1 యోహాను 2:15-17). దేవుని రాజ్యములో పిల్లలుగా ఉండుటకు మనము సృజింపబడినాము; కాబట్టి, విశ్వాసులైన పిల్లలు స్వాస్థ్యమును ఎదురుచూడవచ్చును. విశ్వాసులైన క్రైస్తవులు రాజ్యములో ఉన్నారు, రాజ్యము మనలో ఉన్నది. మనమందులో ఉండగా యేసు రాజ్యమును తిరిగి మనతో కూడ దేవునికి అప్పగిస్తాడు; అప్పుడు దేవుడు "సర్వములో సర్వమగును" 1 కొరింథీ. 15:24-28. సృష్టిలో తండ్రి ఉద్దేశమును సాధించుటకు దేవుని రాజ్యములో క్రీస్తు రాజ్యము పనిచేయుచున్నది. యేసు ఎల్లప్పుడు దేవుని చిత్తమును నెరవేర్చుచుండుటను బట్టి ఈ ఉద్దేశమును అర్థము చేసికొనవచ్చును.

రాజ్యసంస్కృతి, నిర్వాహణ, ప్రాంతము మరియు ఆయన రాజ్యమును స్వతంత్రించు కొనబోవు దేవుని ప్రజల భవిష్యత్తును గూర్చి యేసు బోధ దేవుని చిత్తమును తెలియజేసినది. ఈ సందర్భములో ఉపమానములను అధ్యయనము చేయుటద్వారా "పరలోకరాజ్య మర్మములను" మనమర్థము చేసికొనవచ్చును. యేసుక్రీస్తు సువార్త ద్వారా దేవుని పిలుపు వినిన సాతాను రాజ్యములోని ప్రజలలో ఇది పనిజేస్తుంది. ఈ ప్రజలు "బయటకు పిలువబడినవారు" -సంఘము. క్రొత్త నిబంధనలో వాడబడిన విధముగా "సంఘము" అను మాటను అర్థము చేసికొనుటకు, అపొస్తలుడైన పౌలు ఇచ్చిన ఆజ్ఞలో గుర్తింపబడిన రెండు రాజ్యముల ఉద్దేశమును మనము కలిగియుండవలెను.

> *అప్పుడు నేను -ప్రభువా, నీవు ఎవడవని అడుగగా ప్రభువు నేను -నీవు హింసించుచున్న యేసును. నీవు నన్ను చూచియున్న సంగతిని గూర్చియు నిన్ను పరిచారకునిగాను సాక్షినిగాను నియమించుటకై కనబడియున్నాను. నీవు లేచి నీ పాదములు మోపి నిలువుము; నేను ఈ ప్రజలవలనను అన్యజనులవలనను హాని కలుగకుండ నిన్ను కాపాడెదను; వారు చీకటిలోనుండి వెలుగు లోనికిని సాతాను అధికారమునుండి దేవుని వైపునకును తిరిగి, నాయందలి విశ్వాసముచేత పాపక్షమాపణను, పరిశుద్ధ పరచబడిన వారిలో స్వాస్థ్యమును పొందునట్లు వారి కన్నులు తెరుచుటకై నేను నిన్ను వారియొద్దకు పంపెదనని చెప్పెను.* — *అపొ. కార్య. 26:15-18*

ఫిలిప్పు, పౌలు మరియు ఆత్మపూర్ణులైన ఇతర వ్యక్తుల ద్వారా బోధింపబడిన దేవుని రాజ్యమును అంగీకరించిన విశ్వాసులను తెలుపునదే "సంఘము" అను మాట. అపొ. కార్య. 2:41, 47; 4:32; 5:11; 8:12; 19:8; 20:25; 28:31 చూడండి. యేసు సిలువపై మహిమ పరచబడనంతవరకు, దేవుని నిత్య రాజ్యము కొరకు పిల్లలను అభివృద్ధిపరచు దేవుని ప్రణాళికపై పరిపాలించుటకు యేసును సిద్ధపరచుట సంపూర్తి కాలేదు (యోహాను 7:37-39; లూకా 22:14-22). దేవుడు క్రొత్తనిబంధనను ఇచ్చుటకు సిద్ధపడుచుండగా, యేసు తన రక్తమును చిందించనంతవరకు "క్రీస్తునందు"గా గుర్తింపబడిన క్రొత్త రాజ్యము వాస్తవము కాలేదు (హెబ్రీ. 8:10-12). దేవుని కుమారులు పరిశుద్ధపరచబడు పని పూర్తిగా నిర్వహించబడుట కొరకు పరిశుద్ధాత్మ సేవ/పరిచర్య అవసరమైనది; అయినప్పటికి, దోషారోపణగల మనస్సాక్షి కలిగిన ప్రజలతో దేవుని పరిశుద్ధాత్మ సహవసించలేడు (హెబ్రీ. 9:6-14; 2 కొరింథీ. 13:14). యేసు పునరుత్థానుడై ఆరోహణుడైన తరువాత రాజరికము మరియు యాజకత్వము ఆయన కివ్వ బడినది (అపొ. కార్య. 2:33-36; 5:31, 32; హెబ్రీ. 4:14-16). గమనిక, "'నాయందలి' విశ్వాసముచేత పరిశుద్ధ పరచబడినవారిలో స్వాస్థ్యమును పొందునట్లు" అని యేసు పౌలుతో చెప్పినాడు.

ఎఫెస్సులో ఉన్న సంఘమునకు వ్రాసిన పత్రికలో పౌలు "క్రీస్తునందు" అను మాట అనేకసార్లు ఉపయోగించినాడు. ఆయన ఎఫెస్సులో చీకటిలో జీవిస్తున్న ప్రజలకు దేవుని రాజ్యమును ప్రకటించినాడు (అపొ. కార్య.19:8). దేవుని రాజ్యమును గూర్చిన ఆయన సందేశము "మార్గము," "సత్యము" లాంటిదే (అపొ. కార్య. 19:9, 10). మార్గము, సత్యము అయిన రాజ్య సువార్త పిలుపును అంగీకరించినవారు "బయటికి పిలువబడినవారు" -ఎఫెస్సులోని పరిశుద్ధులు (ఎఫెసీ. 1:1; 1 తిమోతి 1:3; ప్రకటన 2:1, 5). చిన్న ఆసియాలో మరియు ఐరోపాలో దేవుని కొరకు సంఘమును కట్టుటకు, ఈ విధముగా పౌలు యేసుక్రీస్తుకు సహకరించినాడు (మత్తయి 16:17, 19; అపొ. కార్య. 20:25; ఎఫెసీ. 2:19-22).

తన కొరకు పిల్లలను అభివృద్ధిపరచుటకు దేవుని ద్వారా క్రొత్తనిబంధన ఇవ్వ బడినది (హెబ్రీ 8:10-12). దేవుని నిబంధనను మరియు ప్రధానయాజకునిగా యేసు క్రీస్తును అంగీకరించిన వారిపై యేసురాజైయున్నాడు (అపొ. కార్య. 2:36; హెబ్రీ.4:14). దేవుని నిత్యరాజ్యమునకు సంబంధించి క్రీస్తు రాజ్యము ఎలా పని జేస్తుందో ఆలోచిస్తూ ఉండగా, కొరింథీ సంఘమునకు అపొస్తలుడైన పౌలు తెలియజేసిన అదే దృశ్యమును మన మనస్సులలో ఉంచుకొనుట మనకు సహాయకరముగా ఉండవచ్చును.

> *ఆకాశమందైనను భూమిమీదనైనను దేవతలనబడినవి యున్నను, మనకు ఒక్కడే దేవుడున్నాడు. ఆయన తండ్రి; **ఆయన నుండి** సమస్తమును కలిగెను; ఆయన నిమిత్తము మనమున్నాము. మరియు మనకు ప్రభువు ఒక్కడే, ఆయన యేసుక్రీస్తు; **ఆయన ద్వారా** సమస్తమును కలిగెను; మనము **ఆయన ద్వారా** కలిగినవారము.*
> *1 కొరింథీ. 8:6*

దేవుని మరియు యేసుక్రీస్తుని రాజ్యము మధ్య సంబంధమును గూర్చి పూర్తి అవగాహన పొందుట కొరకు **నుండి** మరియు **ద్వారా** అను మాటలను అర్థము చేసికొనుట ప్రాముఖ్యము. పౌలు రోమాలోని పరిశుద్ధులకు వ్రాస్తూ, కొరింథులోని దేవుని ప్రజలను "క్రీస్తు సంఘములు" గాను మరియు ఆయన కొరింథీయులకు వ్రాసిన పత్రికలలో దేవుని ప్రజలను అనేకసార్లు "దేవుని సంఘము"గాను ఎందుకు గుర్తించినాడో అర్థము చేసికొనుటకు ఇది కూడ మనకు సహాయ పడుతుంది (రోమా 16:16; 1 కొరింథీ. 1:2; 10:32; 11:16; 15:9; 2 కొరింథీ. 1:1). గలతీ. 1:13; 1 తిమోతి 3:5లో కూడ పౌలు దేవుని ప్రజలను "దేవుని సంఘము"గా గుర్తించినాడు. యేసుక్రీస్తు వ్యక్తిగతముగా తన కొరకు ఏమైనా చేసికొనుటకు భూమిమీదకు రాలేదు. అది దేవుని చిత్తమవుటవలన ఆయన సిలువపై తన్నుతాను బలిగా అర్పించుకొనినాడు (లూకా 22:42). మానవులను సృజించుట కొరకైన దేవుని ఉద్దేశమును నెరవేర్చుటకు ఆయన ఇప్పుడు రాజుగా పరిపాలిస్తున్నాడు, ప్రధానయాజకుడుగా సేవచేస్తున్నాడు. నేను నా సంఘమును కట్టుదును అని ఆయన చెప్పినప్పుడు, ఆయన దానిని దేవుని కొరకు కట్టినాడు. ఆయన సేవచేయుటకు వచ్చినాడు కాని చేయించుకొనుటకు కాదు (మత్తయి 20:24-28). తన తండ్రిచిత్తమును కొనసాగించుటకు, దేవుని ద్వారా యేసుక్రీస్తు తన తండ్రి కుడిపార్శ్వమునకు పునరుత్థానుడైనాడు. యోహాను 14:13, 24, 28, 31; 15:1; 16:23; అపొ. కార్య. 7:56 చూడండి.

యేసు చేసిన ప్రతిది తన తండ్రి చిత్తమును నెరవేర్చుటకు చేయుటవలన, యేసు రాజరికము మరియు యాజకత్వము దేవుని ప్రజల యొక్క తండ్రియైన దేవునికి సేవచేసినవి. దేవుని చిత్తము యేసు చిత్తము ఒక్కటే కాబట్టి దేవుడు కోరుకొనిన పిల్లలను తన తండ్రియైన దేవుని కొరకు యేసు తీసికొనివస్తాడు (1 కొరింథీ. 15:22-28). దేవుని చిత్తములో, సృష్టికొరకైన తన **ఉద్దేశము** మరియు ఆదాము, హవ్వ ఆయన నిబంధనను మీరిన తరువాత ఆయన ఇచ్చిన **కృప** రెండూ కలిసియున్నవి (2 తిమోతి 1:9). సృష్టి కొరకు దేవునికి ఏ ఉద్దేశము లేకపోయినట్లయితే, ఆయన కృప అవసరమై యుండెడిది కాదు. దేవుని ఉద్దేశమునకు కృప అత్యవసరమైనది, ఎందుకంటె అది "విశ్వాసులైన ప్రజలను" దోషారోపణనుండి స్వతంత్రులను చేస్తుంది; తద్వారా, విశ్వాసము ద్వారా నీతిమంతులుగా తీర్చబడు కృప, తిరిగి జన్మించిన తరువాత దేవునితో మరియు పరిశుద్ధాత్మతో క్రైస్తవులకు సమాధానకరమైన సంబంధమును ఇస్తుంది (రోమా 4:25-5:1). దేవుని వాక్యమును అధ్యయనము చేయుటద్వారా, మన "విశ్వాస ద్వారమును" విస్తృతపరచుట మనము కొనసాగిస్తూ ఉండగా, నిజమైన క్రీస్తు శిష్యులకు దేవుని మరియు యేసుక్రీస్తు యొక్క రాజ్యపు వాస్తవికత బాగా స్పష్ట మవుతుంది (అపొ. కార్య. 14:27; 2 కొరింథీ. 3:18). "దీనివలన మనమాయనయందు నిలిచియున్నామనియు ఆయన మనయందున్నాడనియు తెలిసికొను చున్నాము; ఏలయనగా ఆయన మనకు తన ఆత్మలో పాలు దయచేసియున్నాడు" 1 యోహాను 4:13 అని యోహాను చెప్పినట్లుగా అది మనకు సంభవిస్తుంది.

ఈ సమయములో భూమిమీద నివసించు సంఘమయిన దేవుని ప్రజలు, క్రీస్తు మరియు దేవుని రాజ్యమునందు ''క్రీస్తునందు'' దేవుని ప్రజలైయున్నారు. ''మీరు దేవుని ఆలయమైయున్నారనియు, దేవుని ఆత్మ మీలో నివసించుచున్నాడనియు మీరెరుగరా?'' 1 కొరింథీ. 3:16 అని పౌలు కొరింథీయులను అడిగినాడు. ''ప్రతి కట్ట డమును ఆయనలో చక్కగా అమర్చబడి, ప్రభువునందు పరిశుద్ధమైన దేవాలయమగు టకు వృద్ధిపొందుచున్నది. ఆయనలో మీరుకూడ ఆత్మమూలముగా దేవునికి నివాస స్థలమైయుండుటకు కట్టబడుచున్నారు'' ఎఫెసీ. 2:21, 22.

క్రైస్తవులు-సంఘము యొక్క తీర్పు తరువాత, దేవుని రాజ్యములో నిత్యజీవమును స్వతంత్రించుకొనువారు, అన్ని కాలములనుండి ఉన్న దేవుని ప్రజలందరితో చేర్చబడ తారు (యాకోబు 1:12; 2:5; హెబ్రీ. 11:39, 40). ''జీవముగల దేవుని కుమారులు''గా గుర్తింపుపొందిన ''దేవుని వాగ్దాన పిల్లలు'' కూడ దేవుని రాజ్యములో దేవుని యొద్దకు తిరిగి వస్తారు (రోమా 9:8, 26; ప్రకటన 2:7, 11, 17, 26-28; 3:5, 12, 21). దేవుడు సర్వములో సర్వమైయుంటాడు. పరలోకములో సంఘము లేక దేవుని రాజ్యమను ఉద్దేశము ఉండదు. ఉండేదేమిటంటే, కొంతమంది క్రొత్త పిల్లలతో దేవుని రాజ్యము మాత్రమే.

భౌతిక ఇశ్రాయేలీయులకు దేవుని చివరి ప్రవక్తగా యేసుక్రీస్తు మూడు సంవత్స రములకు పైగా దేవుని రాజ్యమును గూర్చి యూదులకు ప్రకటించినాడు. అపొ. కార్య. 2:1-11:18లో మొదటిసారి అపొస్తలులు ఇశ్రాయేలీయులకు ప్రకటించిన సంపూర్ణ ''విశ్వాసము'' కొరకు వారిని సిద్ధపరచుట ఆయన గురి. మొట్టమొదటిసారి ''క్రీస్తు నందు''గా గుర్తించబడిన నూతనరాజ్యము యూదులకు ఇవ్వజూపబడినది. ''విశ్వాసము'' ''క్రీస్తునందు ఆత్మీయ ఆశీర్వాదములన్నిటిని'' కలిగియున్నది. ఎఫెసీ. 1:3-14 చూడండి. ''క్రీస్తునందు'' అను పదము, క్రైస్తవులకు లోకరాజ్యమునందలి సాతాను పరిపాలననుండి స్వతంత్రమైన క్రొత్తరాజ్యమును ఇవ్వటము మాత్రమే కాక, అది మన శిరస్సుగా పనిచేయుటకు ప్రత్యేకమైన రాజును ఇచ్చినది; కాబట్టి మనము నూతనమనస్సు కలిగియున్నాము (1 కొరింథీ. 2:16). సంఘము క్రీస్తు శరీరము (కొలొస్స. 1:18; ఎఫెసీ. 4:14-16). యేసుక్రీస్తు యొక్క యాజకత్వము మరియు పరిశుద్ధాత్మ సహవాసము, దేవుడు మననుండి మరియు మనలో కోరుకొనిన ఫలమును ఉత్పత్తి చేయునట్లు క్రైస్తవులకొరకు అందించిన నూతన ఆశీర్వాదములు (అపొ. కార్య. 2:38; రోమా 8:5-25; హెబ్రీ 4:14-16). ఈ అంత్యదినముల కాలములో దేవుడు భౌతిక ఇశ్రాయేలునుండి దేవుని రాజ్యమును తీసివేసినాడు. దానిని ఆయన ఆత్మీయ ఇశ్రా యేలుకు ఇచ్చినాడు; ''దేవుని ఇశ్రాయేలు,'' ''దేవుని సంఘము'' గలతీ. 1:13; 6:16. మనము ''వాగ్దాన పిల్లలము'' కూడ అవుట వలన, అన్యులు కూడ ఆత్మీయ ఇశ్రా యేలులో, ''కుమారులు అను పూర్తి హక్కు''తో అబ్రాహాము సంతానముగా చేర్చబడి యున్నారు. రోమా 9:8, 24-26; గలతీ. 3:26-4:7; ఎఫెసీ. 3:6.

రోమాలో ఉన్నపరిశుద్ధులకు వందనములు చెప్పిన ''క్రీస్తు సంఘముల''తో క్రైస్తవులు గుర్తింపబడియున్నారు (రోమా 16:16). మరియు మనము తన తండ్రి కొరకు యేసు కడుతున్న ''దేవుని సంఘ'' సభ్యులుగా కూడ గుర్తింపబడియున్నాము (మత్తయి 16:18; 1 కొరింథీ. 1:2). మనము దేవుని రాజ్యమును పొందియున్నాము; కాబట్టి బాప్తిస్మమిచ్చు యోహాను యూదులను హెచ్చరించిన ఫలములు ఫలించుటకు, ప్రతి క్రైస్తవునిలో దేవుని రాజ్యము ఉండవలెను. ''ఇప్పుడే గొడ్డలి చెట్లవేరున ఉంచ బడియున్నది గనుక మంచి ఫలములు ఫలించని ప్రతి చెట్టును నరకబడి అగ్నిలో వేయబడునని చెప్పెను'' లూకా 3:9. క్రైస్తవులు ఈ చెట్లైయున్నారు. దేవుని రాజ్యమున్నది అలాగే సాతాను రాజ్యము ఉన్నది. ఒక దానిని గుర్తించకుండ మనము రెండవ దానిని గూర్చి బోధించలేము; కాబట్టి మనము ''పరలోకమునకు వెళ్ళుటను'' గూర్చి మాట్లాడినట్లయితే, ''నరకమునకు వెళ్ళే'' అవకాశముకూడ ఉందని గుర్తించవలెను (మార్కు 9:45-48). క్రైస్తవులు లోకరాజ్యము నుండి కృపద్వారా రక్షింపబడియున్నారు. మనము రక్షింపబడియున్నాము, అయితే మనము, రక్షణ విషయములో ఎదుగవలసి యున్నది (1 పేతురు 2:2, 3). మనమెంత బాగా చేశామో దేవుడు, క్రీస్తు ఎరిగియుండు టను గూర్చినదే తీర్పు దినము (యోహాను 5:28-30; 2 కొరింథీ. 5:10).

''విశ్వాస ద్వారము'' అని పేరుపెట్టబడిన ఈ పుస్తకము ముందుమాటలో ఈ సిద్ధాంతములు లేక బోధలు ఎందుకు చేర్చబడియున్నవి? దేవుని రాజ్యములో మన పాత్రను అర్థము చేసికొనుటతో మన బైబిలు అధ్యయనము యొక్క ముందుమాట అవసరతను క్రైస్తవులు అర్థము చేసికొనుటకు, ''పెట్టెలో జన్మించుట'' అని పేరు పెట్టబడిన ఉపోద్ఘాతము సహాయపడుతుంది. చదువుట, అర్థము చేసికొనుట మరియు బైబిలులో మనము చదివిన దానియందు మన విశ్వాసముంచుట కొరకు దేవుడిచ్చిన బాధ్యతను అర్థము చేసికొనుటకు, ఈ ముందుమాటలో తెలియజేసిన సిద్ధాంతములను అర్థము చేసికొను క్రైస్తవులను ప్రోత్సాహించుట ఈ పుస్తకము యొక్క గురియైయున్నది (హెబ్రీ. 5:11-14). నీవు, దేవుని మరియు క్రీస్తు రాజ్యమును గూర్చి మరియు నీవెందుకు సృజింపబడినావో అర్థము చేసికొనని క్రైస్తవుడవైనట్లయితే, ఆయన మానవులను ఎందుకు సృజించినాడను దేవుని కథను చదువుటలో ఈ పుస్తకము నీకు విలువైనదిగా ఉంటుంది. మనము మొదటి పాఠమునుండి రెండవ పాఠము అంశములోనికి ఆ తరువాత పుస్తకమంతటికి వెళ్ళకముందు దయచేసి మొదటి పాఠములోని లేఖనము లను ఆలోచించుము. దేవుని కథ కష్టము కాదు కాబట్టి ఈ లేఖనములు కష్టమైనవి కావు; అయితే మనము అర్థము చేసికొని, నమ్మి మరియు దేవునిరాజ్యమునందు మన విశ్వాసముంచక పోయి నట్లయితే, బైబిలు చదువుట కష్టతరమవటం, లేక ఒకవేళ అసాధ్యమవటం మనం చూస్తాము.

విశ్వాసులైన మారుమనస్సు పొందిన పాపుల కొరకు బలిఅగుటకు మాత్రమే యేసుక్రీస్తు భూమిమీదకు రాలేదు గాని దేవుని రాజ్యమును గూర్చి బోధించుటకు వచ్చియున్నాడు. లూకా 4:43; యోహాను 12:27, 28 చూడండి. యేసు బోధలను గూర్చి మానవ జ్ఞానమునకు మించి మనము యేసుక్రీస్తు బోధలను అంగీకరించవలసి యున్నది.